రాష్ట్రస్థాయి ముఖ్యమంత్రి కప్
పోటీలు ప్రారంభం

సైదాపేట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి కప్ పోటీలను ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ శుక్రవారం ప్రారంభించారు. తమిళనాడు క్రీడాభివృద్ధి కమిషన్ తరఫున ముఖ్యమంత్రి కప్ పోటీలు ఈ నెల 4 నుంచి 24వ తేదీ వరకు చెన్నై, కోయంబత్తూరు, మదురై, తిరుచ్చి నగరాల్లో జరగనున్నాయి. టెన్నిస్, బ్యాడ్మింటన్, కబడ్డీ, కర్రసాము, వెయిట్ లిఫ్టింగ్, ఫుట్‌బాల్, హాకీ, బాక్సింగ్, స్విమ్మింగ్, క్రికెట్, బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్, క్యారమ్స్, కత్తిసాము, చెస్, జిమ్నాస్టిక్స్ తదితర 36 రకాల పోటీలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో చెన్నై నెహ్రూ స్టేడియంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ రాష్ట్ర స్థాయి పోటీలను ప్రారంభించారు. పారాలింపిక్స్ రజత పతక విజేత తులసిమతి, ట్రిపుల్ జంప్ క్రీడాకారుడు ప్రవీణ్ ప్రారంభోత్సవంలో జ్యోతిని పట్టుకెళ్లారు.


లెట్స్ వెయిట్ అండ్ సీ

పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ఉదయనిధి స్పందన

చెన్నై, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తనపై పరోక్షంగా చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ 'లెట్స్ వెయిట్ అండ్ సీ' అంటూ స్పందించారు. తిరుమలలో దీక్ష విరమణ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... 'సనాతన ధర్మం ఓ వైరస్ అని.. దాన్ని అంతం చేస్తామని ఇటీవల ఓ యువ నాయకుడన్నా'రంటూ తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ గురించి ప్రస్తావించారు. ఈ సందర్భంగా తమిళంలోనూ మాట్లాడారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై శుక్రవారం ఉదయనిధి స్టాలిన్‌ను విలేకర్లు ప్రశ్నించగా.. 'లెట్స్ వెయిట్ అండ్ సీ' అంటూ సమాధానం ఇచ్చారు.

ఆస్పత్రి నుంచి
రజనీకాంత్ డిశ్చార్జి

చెన్నై, న్యూస్‌టుడే: ప్రముఖ సినీ నటుడు రజనీకాంత్ ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. సెప్టెంబరు 30వ తేదీ రాత్రి చెన్నై గ్రీమ్స్ రోడ్డులోని అపోలో ఆస్పత్రిలో చేరిన ఆయనకు మరుసటి రోజు గుండె నుంచి వచ్చే ప్రధాన రక్తనాళానికి స్టంట్ వేసిన విషయం తెలిసిందే. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడటంతో ఐసీయూ నుంచి సాధారణ వార్డుకు మార్చారు. గురువారం రాత్రి 11 గంటలకు ఆయన డిశ్చార్జయ్యారు. వైద్యుల సూచనల మేరకు కొన్ని వారాలు ఆయన ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటారని సన్నిహిత వర్గాల సమాచారం.



పలు ప్రాజెక్టులు ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

'కలైతురై విత్తగర్' పురస్కారాల ప్రదానం



మెహతాకు పురస్కారం అందజేస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: 'కలైజ్ఞర్ నినైవు కలైతురై విత్తగర్' పురస్కారాలను వి.మెహతా, ప్రముఖ సినీ నేపథ్య గాయని పి.సుశీలకు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రదానం చేశారు. తమిళ సినీ రంగంలో విశిష్ట సేవలు అందించినవారిని సత్కరించేలా దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి జయంతి సందర్భంగా ఏటా జూన్ 3న రాష్ట్ర ప్రభుత్వం తరఫున 'కలైజ్ఞర్ నినైవు కలైతురై విత్తగర్' పురస్కారాన్ని అందించనున్నట్టు 2022-23వ ఏడాది సమాచార ప్రజా సంబంధాలశాఖ పద్దుల్లో ప్రకటించారు. ఆ మేరకు 2022 పురస్కారాన్ని సినీరంగంలో సుమారు 500 చిత్రాలకు పైగా కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు రాసిన ఆరూర్‌దాస్‌కు ప్రదానం చేశారు. కరుణానిధి శతాబ్ది వేడుకలను పురస్కరించుకుని అదనంగా ఓ మహిళకూ ఈ పురస్కారాన్ని ప్రదానం చేయాలని జులై 11న ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారు. ఆ మేరకు 2023వ ఏడాది పురస్కారాలను ప్రముఖ సినీ నేపథ్య గాయని పి.సుశీల, తమిళ ఆచార్యులు, సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత మెహతాకు ప్రకటించారు. సచివాలయంలో శుక్రవారం వారికి ముఖ్యమంత్రి స్టాలిన్ పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మంత్రి సామినాథన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, తమిళ అభివృద్ధి, సమాచారశాఖ కార్యదర్శి రాజారామన్, సమాచార సంబంధాలశాఖ సంచాలకులు వైద్యనాథన్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి పూర్తయిన ప్రాజెక్టులు

చెన్నై: జలవనరులశాఖ తరఫున 8 జిల్లాల్లో రూ.83.19 కోట్ల వ్యయంతో చేపట్టి పూర్తయిన 19 ప్రాజెక్టు పనులను ముఖ్యమంత్రి స్టాలిన్ అందుబాటులోకి తీసుకొచ్చారు. సచివాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాటిని ఆయన అందుబాటులోకి తీసుకొచ్చారు. అలాగే హిందూ దేవాదాయ, ధర్మాదాయశాఖ తరఫున ఏకకాల పూజ పథకం ఆలయాల్లో పనిచేసే అర్చకుల కుమారులు, కుమార్తెల ఉన్నత చదువులకు విద్యా ఉపకారవేతనంగా 500 మందికి రూ.50లక్షల బ్యాంకు చెక్‌లను ముఖ్యమంత్రి అందించారు. వెంట మంత్రి పీకే శేఖర్‌బాబు ఉన్నారు.

- మూడేళ్లలో సుమారు రూ.10లక్షల కోట్ల ఒప్పందాలు
- 31లక్షల మందికి ఉపాధి పక్కా అంటున్న రాష్ట్ర ప్రభుత్వం

పారిశ్రామిక ప్రభంజనం



పారిశ్రామిక విప్లవంలో తమిళనాడు గమనం చారిత్రాత్మకమేనని చెప్పాలి. దశాబ్దాలుగా ఈ హవా కొనసాగుతూనే ఉంది. తాజాగా ఇది మరిన్ని కొత్త పుంతలు తొక్కిందనే చెప్పాలి. గత మూడేళ్లలోనే చారిత్రాత్మక పెట్టుబడులు సాధ్యమయ్యాయి. దేశ, విదేశీ సంస్థలు రాష్ట్రానికి వరుస కట్టాయి. ఇదంతా రాష్ట్రం సాధించిన గొప్పతనంగానే చెప్పాలి.

ఈనాడు-చెన్నై, న్యూస్‌టుడే-సైదాపేట

తమిళనాడు పెట్టుబడుల రికార్డుల దిశగా వెళ్తోంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం గత మూడేళ్లలోనే ఏకంగా రూ.9.74లక్షల కోట్ల పెట్టుబడుల్ని రాష్ట్రం ఆకర్షించింది. ఏకంగా 27 కొత్త పరిశ్రమలే రాష్ట్రానికి వచ్చాయి. ఈ ఒప్పందాల ద్వారా ఏకంగా 31లక్షల మందికి ఉపాధి అవకాశాలు వస్తున్నట్లుగా అంచనాలు వేస్తున్నారు.

శుభారంభం..

పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతోనే ముందుకు సాగిందని చెప్పాలి. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలి దశలో రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు ఏర్పాటుచేశారు. చెన్నైతో పాటు కోయంబత్తూరు, తూత్తుకుడి తదితర ప్రాంతాల్లో పెట్టుబడిదారులతో సంప్రదింపులు జరిపారు. ఇది ఫలప్రదమవడంతో రూ.1.90లక్షల కోట్ల పెట్టుబడులు సాధ్యమైనట్లు ప్రభుత్వం వెల్లడిస్తోంది. వీటిద్వారా 2.80లక్షల మందికి ఉద్యోగాల కల్పన జరిగిందని పరిశ్రమల శాఖ అధికారులు వివరించారు.



విదేశీబాట

రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువచ్చే అజెండాలో కీలకమైంది.. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ. ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు వివిధ దేశాల్లో పర్యటించి పేరున్న సంస్థలతో చర్చలు జరిపాయి. యూఏఈ, సింగపూర్, మలేషియా, జపాన్ దేశాల పర్యటనల్లో రూ.7,441కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రాష్ట్రానికి అదనంగా 17,371 ఉద్యోగాలు సాధ్యమైనట్లుగా అధికారులు చెబుతున్నారు. మరో విడతలో ముఖ్యమంత్రి స్టాలిన్ స్పెయిన్ దేశాన్ని సందర్శించారు. అక్కడ జరిగిన ఒప్పందాల కారణంగా రూ.3,440 కోట్లు సాధ్యమయ్యాయి. తాజాగా యూఎస్ఏ పర్యటనలో చారిత్రాత్మక ఒప్పందాలే జరిగాయి. 19 ఒప్పందాల్లో 11,516 ఉద్యోగాలు కల్పించేలా చర్చలు జరిగినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

ఒకేసారి 19 కంపెనీలు

విదేశీ పర్యటనలతో వచ్చిన పెట్టుబడుల ద్వారా పలు కంపెనీలను కూడా రాష్ట్రంలో ప్రారంభించారు. ఈ ఏడాది ఆగస్టులో ఒకేసారి 19 పరిశ్రమలను రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. వీటి విలువ రూ.17,616కోట్లుగా ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో పలు కీలక సంస్థలకు చెందినవే ఉన్నాయి. ఓమరాన్, టీవీఎస్, ఎల్‌అండ్‌టీ, రెనాల్ట్ నిస్సాన్, మిల్కీమిస్ట్, రాయల్ ఎన్‌ఫీల్డ్ లాంటి సంస్థలు ఇందులో ఉన్నాయి. మరోవైపు రాణిపేట కేంద్రంగా టాటా మోటార్స్‌కు చెందిన వాహన తయారీ ప్లాంటును తెరిచారు. ఇక్కడ ఆ సంస్థ రూ.9వేల కోట్ల పెట్టుబడులు పెడుతోంది. ఫోర్డ్, గూగుల్ సంస్థలు సైతం ఇక్కడ కంపెనీలు పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రత్యేకంగా ఏఐ రంగం వృద్ధి కోసం ప్రత్యేక శిక్షణా కార్యక్రమాల్ని తెస్తున్నారు. మైక్రోసాఫ్ట్, నైక్ తదితర ప్రముఖ సంస్థలూ ముందుకొచ్చాయి.


రాణిపేట పనపాక్కం సిప్‌కాట్‌లో టాటా మోటార్స్ సంస్థ ఏర్పాటుకు శంకుస్థాపన జరిగిన సమయంలో ప్లాంటు నమూనాను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా తదితరులు

సదస్సు భారీ విజయం

తమిళనాడుకే తలమానికంగా చెన్నై కేంద్రంగా ఈ ఏడాది జనవరిలో ప్రపంచ పెట్టుబడిదారుల సదస్సును నిర్వహించారు. గత రికార్డులను చెరిపేస్తూ ఏకంగా ఈ సదస్సు నేపథ్యంగా రూ.6.64లక్షల కోట్ల ఒప్పందాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంగా 631 ఒప్పందాలు జరిగాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా 26.90లక్షల ఉద్యోగాలు సాధ్యమయ్యాయని ప్రభుత్వం వివరించింది.

పెరిగిన ఉపాధి అవకాశాలు

కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన గణాంకాల ప్రకారం.. 2023-24లో తమిళనాడు రాష్ట్రంలో 7.5శాతం తయారీ రంగంలో ఉద్యోగావకాశాలు పెరిగినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇది రాష్ట్ర విజయమేనని ప్రభుత్వం చెబుతోంది. రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యోగాల కల్పనకు, మరిన్ని పరిశ్రమలు వచ్చేందుకు ప్రభుత్వ శ్రమ దోహదపడుతుందని వివరించింది.

పాడైన ఆహారం తినడంతోనే
పశ్చిమ బెంగాల్ కార్మికుడి మృతి

చెన్నై జీహెచ్ డీన్ వెల్లడి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పశ్చిమ బెంగాల్‌కు చెందిన కార్మికులు వ్యవసాయ పనులకు రైలు ద్వారా తమిళనాడు వచ్చారు. ఇక్కడ పని దొరక్కపోవడంతో తిరిగి సొంతూరికి వెళ్లేందుకు చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు వచ్చారు. అక్కడ ప్లాట్‌ఫారంపై నాలుగు రోజులపాటు సరిగ్గా ఆహారం తినకుండా ఉండటంతో పలువురు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారిని రైల్వే పోలీసులు చెన్నై రాజీవ్‌గాంధీ ఆస్పత్రిలో సెప్టెంబర్ 16న చేర్చారు. అందులో సమర్కాన్ అనే వ్యక్తి మరణించగా, మరో వ్యక్తికి కిడ్నీ దెబ్బతిందని వైద్యులు తెలిపారు. దీని గురించి ఆస్పత్రి డీన్ ధరణిరాజన్ మాట్లాడుతూ.. పాడైన ఆహారం తినడం వలన సమర్కాన్‌కు కడుపునొప్పి, వాంతులయ్యాయని చెప్పారు. దీంతో అత్యవసర చికిత్స అందించామని, ఈ క్రమంలో పూర్తిగా ఆరోగ్యం క్షీణించి శ్వాసతీసుకోవడానికి ఇబ్బందిగా మారిందని, కిడ్నీ ఇన్‌ఫెక్షన్‌కు గురై చికిత్స పొందుతూ మృతి చెందాడని వివరించారు. పలు అవయవాలు పనిచేయక పోవడమే మరణానికి దారి తీసిందన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఓఆర్ రామచంద్రన్ కన్నుమూత




ప్యారిస్, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే ఓఆర్ రామచంద్రన్ (77) అనారోగ్యంతో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. తేని జిల్లా కంబానికి చెందిన రామచంద్రన్ 1947 జనవరి 21న రైతు కుటుంబంలో జన్మించారు. రైతు సంఘ అధ్యక్షుడిగా, కంబం మున్సిపల్ ఛైర్మన్‌గా బాధ్యతలు వహించారు. 1991 అసెంబ్లీ ఎన్నికల్లో కంబం శాసనసభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. అనంతరం 1996, 2001లోనూ విజయం సాధించారు. ప్రస్తుతం టీఎంసీలో ఉన్నతస్థాయి కమిటీ సభ్యుడిగా, ఎన్నికల విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. కొంతకాలంగా వయోధిక సమస్యలతో బాధపడుతున్న ఆయన శుక్రవారం మధ్యాహ్నం కన్నుమూశారు. ఆయన భౌతికకాయానికి పార్టీ నేతలు, కార్యకర్తలు నివాళులర్పించారు.

విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి: ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో విష జ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి కోరారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో గత కొద్ది రోజులుగా డెంగీ, మలేరియా, ఫ్లూ బాధితులు పెరుగుతున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రులు నిండిపోతున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. రోగులకు సరిపడా మందులు అందించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయని చెప్పారు. వెంటనే ఆస్పత్రుల్లో రోగులకు సరిపడా మందులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పలు ఆస్పత్రుల ప్రాంగణాల్లో మురుగునీరు చేరి దుర్వాసన వెదజల్లుతోందని, ఆస్పత్రులే రోగాలకు నిలయంగా మారాయని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం వెంటనే ఆస్పత్రులు, నివాస ప్రాంతాలు తదితర చోట్ల నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే వైద్య శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్నందున విష జ్వరాల వ్యాప్తిని నియంత్రించేందుకు తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

స్వాతంత్ర్య సమరయోధులకు గవర్నర్ నివాళి


సుబ్రహ్మణ్య శివ, తిరుప్పూర్ కుమరన్ చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న గవర్నర్ ఆర్ ఎన్ రవి

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్రానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు సుబ్రహ్మణ్య శివ, తిరుప్పూర్ కుమరన్ జయంతి సందర్భంగా వారికి గవర్నర్ ఆర్.ఎన్.రవి నివాళులర్పించారు. గిండిలోని రాజ్‌భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన వారి చిత్రపటాలకు గవర్నర్ పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా తన 'ఎక్స్' పేజీలో.. సుబ్రహ్మణ్య శివ, తిరుప్పూర్ కుమరన్ త్యాగాలను కీర్తించారు. బాలగంగాధర తిలక్‌ను అంకితభావంతో అనుసరించి తన ఉద్వేగమైన ప్రసంగాలు, లోతైన రచనల ద్వారా పలువురి యువకుల్లో జాతీయ స్వాతంత్ర్య ఉద్యమ కాంక్షను సుబ్రహ్మణ్య శివ తీసుకొచ్చారని తెలిపారు. మహాకవి సుబ్రహ్మణ్య భారతియార్, వీవో చిదంబరం పిళ్లైతో కలిసి జాతీయ స్వాతంత్ర్యం కోసం తమిళనాడులో గురుతర బాధ్యతను చేపట్టి ముందుకు నడిపించారని పేర్కొన్నారు. తిరుప్పూర్ కుమరన్ తన చివరి శ్వాసవరకు మన జెండా ఏకత్వాన్ని కాపాడారని తెలిపారు.


ర్యాలీ ప్రారంభిస్తున్న మంత్రి మా.సుబ్రమణియన్

9శాతం తగ్గిన ప్రసూతి మరణాలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రసూతి మరణాలు 9శాతం తగ్గాయని ఆరోగ్యశాఖ మంత్రి మా.సుబ్రమణియన్ తెలిపారు. మూడో అంతర్జాతీయ ప్రజారోగ్య సదస్సు 'డీపీహెచ్ఐసీవోఎన్-2024' తంజావూర్‌లో గురువారం సాయంత్రం జరిగింది. ఇందులో పలుశాఖల తరఫున జరిగిన ర్యాలీని ఆరోగ్యశాఖ మంత్రి మా.సుబ్రమణియన్ ప్రారంభించారు. అదేవిధంగా మరో కార్యక్రమంలో దివ్యాంగులకు పని నియమాక ఉత్తర్వులను అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గతేడాదితో పోలిస్తే ఈఏడాది ప్రసూతి మరణాలు 9శాతం తగ్గాయన్నారు. ప్రసూతి మరణాలరహిత జిల్లాగా విరుదునగర్ నిలిచిందన్నారు. మైలాడుదురై ప్రభుత్వ ఆస్పత్రిలో ఒకే సిరంజిని పలువురు రోగులకు ఉపయోగించిన సిబ్బందిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో మందులు, వైద్య పరికరాల కొరత లేదన్నారు. 1,066 మంది హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, 2,253 మంది గ్రామ ఆరోగ్య నర్సులు, 2,550 మంది వైద్యుల నియామకానికి పనులు ప్రారంభించామని పేర్కొన్నారు.

ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి
సందీప్ సక్సేనాకు గుండెపోటు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఓ కేసు వ్యవహారంగా నామక్కల్ కోర్టులో హాజరుకావడానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సందీప్ సక్సేనా శుక్రవారం నామక్కల్ చేరుకున్నారు. కోర్టు ప్రాంగణంలో హఠాత్తుగా గుండెనొప్పి రావడంతో నామక్కల్ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి సేలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

మద్య నిషేధంపై
డీఎంకే ద్వంద్వ వైఖరి: ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: మద్య నిషేధం వ్యవహారంలో డీఎంకే ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం ఆరోపించారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... భారత రాజ్యాంగం ప్రకారం మద్యం రాష్ట్ర జాబితాలో ఉందన్నారు. రాష్ట్రానికి ఉండే ఈ అధికారాన్ని ఉపయోగించి రాష్ట్రంలో మద్యాన్ని తీసుకొచ్చింది డీఎంకే ప్రభుత్వమేనని తెలిపారు. అదే అధికారం ఉపయోగించి నిషేధం విధించాలని పేర్కొన్నారు. రాష్ట్ర హక్కులు, స్వయంప్రతిపత్తి, విద్యను రాష్ట్ర జాబితాలోకి తేవాలని పదేపదే మాట్లాడే డీఎంకే రాష్ట్ర జాబితాలో ఉండే మద్యాన్ని నిషేధించించేందుకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మద్యం తయారీ పరిశ్రమల యజమానులంతా డీఎంకే నేతలు కావడంతో నిషేదం అమలు చేసేందుకు డీఎంకే వెనుకాడుతుందేమోనని విమర్శించారు. మద్య నిషేధం అమలుకు డీఎంకే ప్రభుత్వం ముందు రావాలని డిమాండ్ చేశారు.

టీవీకే.. చిన్న ద్రవిడ పార్టీ : తమిళిసై

సైదాపేట, న్యూస్‌టుడే: నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం ఓ చిన్న ద్రవిడ పార్టీ అని మాజీ గవర్నర్, భాజపా సీనియర్ నాయకురాలు తమిళిసై సౌందరరాజన్ ఎద్దేవా చేశారు. చెన్నై టీనగర్‌లోని భాజపా ప్రధాన కార్యాలయంలో ఆమె శుక్రవారం విలేకర్లతో మాట్లాడుతూ... పెరియార్‌ను పూజిస్తూనే దేవుడినీ పూజిస్తున్నారని చెప్పారు. అలాగే అన్ని కార్యక్రమాలు మంచి ముహూర్తాలు చూసి చేస్తున్నారని పేర్కొన్నారు. డీఎంకేలాగే విజయ్ పార్టీ తీరు కూడా ఉందని తెలిపారు. తిరుమావళవన్ నాగరికత తెలిసిన నాయకుడనుకున్నానని, అయితే అది నిజం కాదని తెలిసిందన్నారు. తిరుమావళవన్ పార్టీలో కూడా మత విశ్వాసం ఉండేవారు ఉన్నారని, తిరుమావళవన్‌కు కూడా హిందూ మతంపై విశ్వాసం ఉందన్నారు. అతను గాంధీ జయంతి రోజుకావడంతో అక్టోబర్ 2న మహానాడు జరపలేదని, అమావాస్య కావడంతోనే జరిపాడన్నదే నిజమని తెలిపారు. జాతిపితను ప్రతిరోజూ అగౌరవపరుస్తున్నారని విమర్శించారు. గాంధీని విమర్శించినా కూటమి పార్టీ అయిన కాంగ్రెస్ పట్టించుకోదని, సోనియా లేదా రాహుల్‌ని విమర్శిస్తేనే నోరు మెదుపుతుందని ధ్వజమెత్తారు.

50 మంది రాష్ట్ర జాలర్ల విడుదల

ప్యారిస్, న్యూస్‌టుడే: శ్రీలంక జైల్లో ఉన్న 50 మంది జాలర్లను విడుదల చేసిన శ్రీలంక కోర్టు ఐదుగురికి జైలు శిక్ష విధించింది. సెప్టెంబరు 7న చేపల వేటకు వెళ్లిన 14 మంది పుదుక్కోట్టై జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. అంతకు ముందు నలుగురిని అరెస్టు చేసింది. 18 మంది మత్స్యకారుల రిమాండ్ శుక్రవారంతో పూర్తి కావడంతో వారిని కోర్టులో హాజరుపరిచారు. అప్పుడు 13 మందిని విడుదల చేసిన కోర్టు.. ఐదుగురికి జైలు శిక్ష విధించింది. అదేవిధంగా సెప్టెంబరు 21న మైలాడుతురైకి చెందిన 37 మంది అరెస్టయిన కేసుని కూడా విచారించింది. వారిని జాలర్లను విడుదల చేసి, వారి మూడు పడలను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. అనంతరం విడుదలైన 50 మందిని భారత కాన్సులేట్‌కి అప్పగించారు.


ఈశా కేసులో తదుపరి ఉత్తర్వులు ఇవ్వలేము

మద్రాసు హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: ఈశా యోగా కేంద్రంలో పోలీసులు దర్యాప్తు చేయడానికి సుప్రీంకోర్టు స్టే విధించడంతో తదుపరి ఆదేశాలు జారీ చేయడం కుదరదని మద్రాసు హైకోర్టు తెలిపింది. వడవళ్లికి చెందిన కామరాజ్ తన కుమార్తెలు ఈశా యోగా కేంద్రంలో ఉంటున్నారని, వారిని కలిసేందుకు నిర్వాహకులు అనుమతి ఇవ్వడంలేదని, తమ కుమార్తెలను కోర్టులో హాజరుపరచాలని పేర్కొంటూ మద్రాసు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు ఇదివరకే విచారించిన హైకోర్టు.. యోగా కేంద్రంలో తనిఖీ చేసి నివేదిక దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ఈశా కేంద్రం సుప్రీం కోర్టుని ఆశ్రయించడంతో పోలీసుల దర్యాప్తునకు సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ నేపథ్యంలో ఈ కేసు జస్టిస్ ఎస్ఎం సుబ్రమణియం, జస్టిస్ శివజ్ఞానం ధర్మాసనంలో శుక్రవారం మళ్లీ విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ఈశా తరఫున సుప్రీంకోర్టు ఉత్తర్వుల నకలను దాఖలు చేశారు. అనంతరం కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో తదుపరి ఉత్తర్వులు ఇవ్వడం కుదరదని ధర్మాసనం తెలిపింది.


అద్భుతం.. వైమానిక దళ పూర్వాభినయం

వడపళని, న్యూస్‌టుడే: మెరీనా తీరంలో శుక్రవారం జరిగిన భారత వైమానికదళ వాయు విన్యాసాల పూర్వాభినయం తిలకించేందుకు నగరవాసులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఫ్రంట్‌లైన్ ఫైటర్లు, హెలికాప్టర్లు, వింటేజ్ విమానాలు ప్రదర్శించిన విన్యాసాలు అమితంగా ఆకట్టుకున్నాయి. ఆకాశ్ గంగ స్కైడైవింగ్ బృందం 32 ఎయిర్ క్రాఫ్ట్ నుంచి 8 వేల అడుగుల ఎత్తు నుంచి దూకే విధానం అందరినీ కలవరపరచింది. తాంబరం ఎయిర్‌ఫోర్స్ స్టేషను నుంచి చేతక్ హెలికాప్టర్లు జాతీయ పతాక రంగులతో కూడిన పొగలతో దూసుకెళ్లాయి. రఫేల్ వంటి యుద్ధ విమానాలు పూర్వాభినయంలో పాల్గొన్నాయి.


సైనిక హెలికాప్టర్లు


కాంతులు వెదజల్లుతున్న దృశ్యం


హెలికాప్టర్ నుంచి దిగుతున్న సైనికులు


శత్రు సైన్యాన్ని ఎదుర్కొంటూ..


త్రివర్ణ పతాక పొగలు వదులుతూ దూసుకెళ్తున్న జెట్‌లు

టీవీకే మహానాడు వేదిక నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న బుస్సీ ఆనంద్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం జిల్లా విక్రవాండి సమీప వి.సాలై ప్రాంతంలో ఈనెల 27వ తేదీ తమిళగ వెట్రి కళగం (టీవీకే) మొదటి రాష్ట్ర మహానాడు నిర్వహించనున్నారు. ఇందుకుగాను వేదిక నిర్మాణానికి శుక్రవారం వేకువజామున బ్రహ్మ ముహూర్తంలో భూమిపూజ నిర్వహించారు. ఇందులో పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ పాల్గొని పనులను ప్రారంభించారు. అనేక జిల్లాల నుంచి నిర్వాహకులు విచ్చేశారు. దీంతో చెన్నై - తిరుచ్చి జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తింది. పోలీసులు ట్రాఫిక్‌ను సరిచేశారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గిండి, అన్నానగర్ వెస్ట్, తరమణి, పొన్నేరి, రెడ్‌హిల్స్ ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు.

పది విమాన సర్వీసులు రద్దు

వడపళని, న్యూస్‌టుడే: ప్రయాణికుల సంఖ్య తక్కువ ఉండటం, పరిపాలనా సమస్యలతో శుక్రవారం చెన్నై నుంచి బయల్దేరే పది విమాన సర్వీసులు రద్దయ్యాయి. అండమాన్‌కు ఉదయం 7.45కి వెళ్లాల్సిన ఆకాశ ఎయిర్‌లైన్స్, 11.20కి శ్రీలంక వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా, అర్ధరాత్రి 1.20కి బెంగళూరు వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా, అర్ధరాత్రి 1.40కి బెంగళూరు వెళ్లాల్సిన ఆకాశ ఎయిర్‌లైన్స్, మధ్యాహ్నం 3.25కి ముంబయి వెళ్లాల్సిన ఎయిరిండియా విమానాలు రద్దు చేశారు. బెంగళూరు నుంచి చెన్నైకి ఉదయం 7.05కి రావాల్సిన ఆకాశ ఎయిర్‌లైన్స్, ముంబయి నుంచి మధ్యాహ్నం 12.05కు రావాల్సిన ఎయిరిండియా, అండమాన్ నుంచి అర్ధరాత్రి 1.00కి రావాల్సిన ఆకాశ ఎయిర్‌లైన్స్, మదురై నుంచి మధ్యాహ్నం 2.45కి రావాల్సిన ఎయిరిండియా, శ్రీలంక నుంచి మధ్యాహ్నం 3.40కి రావాల్సిన ఎయిరిండియా సర్వీసులు రద్దయ్యాయి. విమానాల రద్దు గురించి ప్రయాణికులకు ముందుగానే తెలియజేసి ప్రత్యామ్నాయ సర్వీసుల ద్వారా వారికి సేవలందించామని అధికారులు పేర్కొన్నారు.

పట్టాలెక్కనున్న హైడ్రోజన్ రైలు

ఐసీఎఫ్‌లో తయారీ



విల్లివాక్కం, న్యూస్‌టుడే: భారత రైల్వే మరో మెట్టు ఎక్కడానికి కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఆ మేరకు పర్యావరణానికి హానికలగకుండా హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ (హైడ్రోజన్ ఇంధనం) ఉపయోగించి రైళ్లను నడపాలని తీర్మానించింది. ఇప్పటికే ఇటువంటి రైళ్లు చైనా, జర్మనీ, ఫ్రాన్స్, స్వీడన్ దేశాల్లో నడుస్తున్నాయి. ప్రస్తుతం డీఈఎంయూ (డీజిల్ ఎలక్ట్రికల్ మల్టిపుల్ యూనిట్) రైళ్లలో హైడ్రోజన్ ఇంధనం వాడి ఆదర్శ పథకంగా ప్రవేశపెట్టనుంది. ఈ రైలుని ప్రయోగాత్మకంగా నార్తర్న్ రైల్వే జోన్ పరిధి హరియాణాలోని జింద్-సోనిపట్ మధ్య డిసెంబరులో నడపనున్నారు. పెట్రోల్, డీజిల్ లాంటి ఇతర ఇంధనాలు కాలుష్యకరమైన పొగను విడుదల చేస్తాయి. కానీ, హైడ్రోజన్ నీటిని మాత్రమే విడుదల చేసే సహజ వాయువు.

మహాబలిపురంలో రూపుదిద్దుకున్న భారీ శివుడి విగ్రహం



ఏకశిలా శివుడి విగ్రహం


మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా మహాబలిపురంలోని పంచరథాల రోడ్డులో ఉన్న ఓ శిల్పాలయంలో 35 టన్నుల నల్లరాతితో 20 అడుగుల ఎత్తుతో శివుడి విగ్రహాన్ని పల్లవుల కాలంనాటి శిల్ప కళతో అక్కడి శిల్పులు చెక్కుతున్నారు. గత 8 నెలలుగా శిల్పి భూపతితో కలిసి 10 మంది శిల్పులు రేయింబవళ్లు శ్రమించి విగ్రహాన్ని రూపొందించారు. ప్రస్తుతం విగ్రహానికి తుది రూపాన్ని మలుస్తున్నారు. బద్రీనాథ్, కేథార్‌నాథ్ మొదలైన పుణ్యక్షేత్రాల్లో ఇలాంటి శివుడి విగ్రహాలను మనం చూడవచ్చు. ప్రస్తుతం మహాబలిపురంలో రూపుదిద్దుకుంటున్న ఈ విగ్రహాన్ని కర్ణాటక రాష్ట్రం మైసూర్‌లో ప్రతిష్ఠించిన తరువాత అక్కడ ఆలయాన్ని నిర్మించనున్నారు. త్వరలో భారీ వాహనం ద్వారా మైసూర్‌కు తరలించనున్నారు.



కొలువు తిలకిస్తున్న గవర్నర్ దంపతులు

రాజ్‌భవన్‌లో నవరాత్రి కొలువు

చెన్నై, న్యూస్‌టుడే: రాజ్‌భవన్‌లో నవరాత్రి కొలువు సంబరాలు నిర్వహించారు. నవరాత్రి వేడుకలను గిండిలోని రాజ్‌భవన్‌లో పది రోజులు పాటు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గురువారం కొలువు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నవరాత్రి పూజ, కలైమామణి భారతి తిరుమగన్, వారి బృందంతో విల్లుపాట కార్యక్రమాన్ని నిర్వహించారు. వాటిని గవర్నర్ దంపతులు, రాజ్‌భవన్ అధికారులు, ఉద్యోగులు తిలకించారు. కార్యక్రమంలో భాగంగా భారతి తిరుమగన్, వారి బృందాన్ని గవర్నర్ ఆర్.ఎన్.రవి సత్కరించారు.



పరిశోధక వ్యాసంతో ఆచార్యులు రిషికేశ కృష్ణన్, తిల్లైరాజన్, అమితాబ్ కాంత్, శ్రీవర్ధిని కె.ఝూ, ఆనంద్ శ్రీ గణేశ్

ఐఐటీఎంలో పరిశోధక వ్యాసం విడుదల

వడపళని, న్యూస్‌టుడే: ఐఐఎం బెంగళూరు స్టార్టప్ ఇన్‌క్యుబేటర్ ఎన్ఎస్ఆర్‌సీఈఎల్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మద్రాస్ (ఐఐటీఎం). 'సెంటర్ ఫర్ రిసెర్చ్ ఆన్ స్టార్టప్స్ అండ్ రిస్క్ ఫైనాన్సింగ్' (సీఆర్ఈఎస్టీ) కలిసి 'ఇండియా ఇన్‌క్యుబేటర్ కలైడోస్కోప్ 2024' పేరిట పరిశోధక వ్యాసాన్ని విడుదల చేశాయి. ఈ మేరకు ఐఐటీ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఐఐటీఎం ఫైనాన్స్, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగ ఆచార్యులు, సీఆర్ఈఎస్టీ హెడ్ తిల్లైరాజన్, ఐఐఎం బెంగళూరు, ఎన్ఎస్ఆర్‌సీఈఎల్ ఛెయిర్‌పర్సన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆచార్యులు, శ్రీవర్ధిని కె.ఝూ పరిశోధక వ్యాస రూపకల్పనకు కృషి చేశారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లను తీర్చిదిద్దేందుకు ఇన్‌క్యుబేటర్ల పాత్ర చాలా కీలకమైందని శ్రీవర్ధిని అన్నారు. ఆచార్యులు తిల్లైరాజన్, నీతి ఆయోగ్ మాజీ సీఈవో అమితాబ్‌కాంత్, ఐఐటీ డైరెక్టరు వి.కామకోటి తదితరులు పరిశోధక వ్యాసం గురించి వివరించారు. ఐఐఎం బెంగళూరు డైరెక్టరు టి.రిషికేశ కృష్ణన్, ఎన్ఎస్ఆర్‌సీఈఎల్ సీఈఓ ఆనంద్ శ్రీ గణేశ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు భారీగా నిధులు

రూ.63,246 కోట్ల విడుదలకు కేంద్రం ఆమోదం



- న్యూస్‌టుడే, వడపళని

చెన్నై నగరంలో రెండో దశ మెట్రో రైలు మార్గం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధుల కోసం కేంద్రాన్ని అభ్యర్థిస్తూ వస్తోంది. ఎట్టకేలకు కేంద్ర మంత్రివర్గం గురువారం రూ.63,246 కోట్ల నిధులు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. రెండో దశలో మూడు వేర్వేరు మార్గాల్లో నిర్మాణం ప్రారంభమైన సంగతి తెలిసిందే. 2027 నాటికల్లా ప్రాజెక్టు పూర్తి చేయాలన్నది ప్రభుత్వం, మెట్రో రైలు సంస్థల సంకల్పం. రెండో దశ మార్గం పూర్తయిన తర్వాత 178 కి.మీ వరకు మెట్రో మార్గం ఉంటుంది. కేంద్ర మంత్రివర్గం ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయడంపై ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్‌లో రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. మెట్రో సేవలు అందుబాటులోకి రాగానే ట్రాఫిక్ రద్దీ తగ్గి, సుస్థిరత పెరిగి, ఆదాయ వనరులు కూడా పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఇటీవల ప్రధానిని కలిసి రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి చర్చించారు. ప్రస్తుతం నిధులు విడుదల చేయడంతో ఆయన ప్రధానికి సామాజిక మాధ్యమాల వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

గంటకు 32 కి.మీ వేగం

మాధవరం నుంచి సిప్కాట్, లైట్ హౌజ్ నుంచి పూనమల్లి బైపాస్, మాధవరం నుంచి షోలింగనల్లూరు వరకు మూడు వేర్వేరు మార్గాలుంటాయి. ఇందులో 64 శాతం మేరకు మార్గాలు పైవైపు ఉండగా, మిగిలిన ట్రాక్ భూగర్భంలో ఉంటుంది. గంటకు 80 కి.మీ వేగంతో నడిచే విధంగా డిజైన్ చేస్తున్నారు. అయితే రైలుకు కేటాయించిన వేగం ప్రస్తుతం గంటకు 32 కిలోమీటర్లు. ఇందుకు సంబంధించి కేంద్ర సమాచారశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. నిధులు మంజూరై సేవలు అందుబాటులోకి వచ్చిన తర్వాత మెట్రో నెట్‌వర్క్‌లో అదనంగా రోజుకు 13 లక్షల మంది ప్రయాణించే వీలుంటుందని అన్నారు. రెండో దశలో రానున్న ప్రాజెక్టుతో సబర్బన్ రైళ్లు, నగరంలోపల, బయటి ఊళ్లకు వెళ్లేందుకు వీలుగా 21 ప్రాంతాల్లో బస్సు టెర్మినస్‌లుంటాయన్నారు. అదేవిధంగా మెట్రో మొదటి దశలోని ఏడు చోట్ల కూడా అనుసంధానం ఉంటుందని చెప్పారు.

రాష్ట్రంలో డెంగీ వ్యాప్తి లేదు



మాట్లాడుతున్న మంత్రి మా.సుబ్రమణియన్

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో డెంగీ వ్యాప్తిలేదని ఆరోగ్యశాఖ మంత్రి మా.సుబ్రమణియన్ స్పష్టం చేశారు. కోవై సింగానల్లూరులో రూ.1.50 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆరోగ్యశాఖ కార్యాలయ భవనాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీల్లో శిథిలావస్థకు చేరిన భవనాలను తొలగించి కొత్త భవనాల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. త్వరలో 2253 మంది వైద్యులను నియమించనున్నట్లు వెల్లడించారు. 1066 మంది హెల్త్ ఇన్‌స్పెక్టర్ల నియామకానికి సంబంధించి వివిధ కోర్టుల్లో 38 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, కేసులు దాఖలు చేసిన వారితో సంప్రదింపులు జరుగుతున్నాయని, వారు రాజీపడి పిటిషన్లను ఉపసంహరించుకుంటే ఖాళీలను భర్తీ చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో 13 రకాల టీకాలు ప్రభుత్వాస్పత్రుల్లో కొరత లేకుండా ఉన్నాయని తెలిపారు. ఈశాన్య రుతుపవనాల దృష్ట్యా ఈనెల 15 తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో డెంగీ వేగంగా వ్యాప్తి చెందుతోందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి చేసిన ఆరోపణల్లో వాస్తవంలేదన్నారు. ఎంపీ గణపతి రాజ్‌కుమార్, జిల్లా కలెక్టర్ క్రాంతికుమార్ పాడి, మేయర్ రంగనాయకి పాల్గొన్నారు.

పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

అన్బుమణి

సైదాపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వంలో అమలు చేస్తున్న పారిశ్రామిక ప్రాజెక్టుల సంఖ్య 500 శాతం పెరిగిందని, అలాగే శంకుస్థాపన చేసిన ప్రాజెక్టుల సంఖ్య 1000 శాతం కంటే ఎక్కువగా ఉందని పరిశ్రమల శాఖ మంత్రి తెలిపారని, దీన్నిబట్టి డీఎంకే తప్పుడు లెక్కలు చెబుతూ ప్రచారం చేసుకుంటుందని అర్థం అవుతోందన్నారు. ఇకవేళ మంత్రి చెప్పింది నిజమైతే పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని, లేకుంటే పెట్టుబడులను ఆకర్షించటంలో విఫలమైనట్లు అంగీకరించాలని డిమాండ్ చేశారు.

పుళల్ జైల్లో నూతన బ్లాక్ ప్రారంభం



బ్లాక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రఘుపతి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: పుళల్ కేంద్ర కారాగారంలో 3400 మంది ఖైదీలు ఉన్నారు. వీరిని కలిసి మాట్లాడేందుకు రోజుకు సగటున 700 మంది వచ్చి వెళ్తున్నారు. దీంతో జైలు ప్రాంగణంలో రద్దీ కారణంగా రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీంతో జైలుశాఖ అధికారులు ఖైదీలను కలిసేందుకు వచ్చే వారికి 13 రౌండ్ల పద్ధతి ప్రవేశపెట్టారు. ప్రతి రౌండ్‌లో 56 మంది ఖైదీలతో మాట్లాడవచ్చు. ఇందుకోసం కొత్త బ్లాక్‌లు నిర్మించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వారంలో రెండు రోజులు ఖైదీలను కలిసి మాట్లాడేందుకు అనుమతి కల్పించారు. సమయాన్ని ముందుగానే బుక్ చేసుకునేందుకు 044- 2659 0000 ఫోన్ నెంబర్‌ను సంప్రదించవచ్చు. అదేవిధంగా న్యాయవాదులు ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఖైదీలను కలిసి మాట్లాడేందుకు అనుమతి కల్పించారు. జైల్లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు 800 మంది ఉంటున్నారు. వీరికి స్వచ్ఛంద సంస్థల ద్వారా నృత్యం, సంగీతం, పాటలపై శిక్షణ ఇవ్వనున్నట్లు జైళ్ల శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో కొత్త బ్లాక్‌ను మంత్రి రఘుపతి శుక్రవారం ప్రారంభించారు. జైళ్లశాఖ చీఫ్ డైరెక్టర్ మహేశ్వర్ దయాళ్, ఎమ్మెల్యే సుదర్శనం కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆదాయం పెంచుకునేందుకు సీఎంఆర్ఎల్ ఒప్పందాలు



ఒప్పందపత్రాలతో ఇరు సంస్థల ప్రతినిధులు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఖాళీ స్థలాల నుంచి ఆదాయాన్ని సమకూర్చుకునే దిశగా 'ఆర్వీ అసోసియేట్స్ ఆర్కిటెక్ట్స్ ఇంజినీర్స్ అండ్ కన్సలెంట్స్ ప్రయివేట్ లిమిటెడ్, అనరాక్ ప్రాపర్టీ కన్సల్టెంట్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థలతో గురువారం ఒప్పందాలను కుదుర్చుకున్నట్లు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. తిరుమంగళం మెట్రో స్టేషను వద్ద సీఎంఆర్ఎల్‌కు ఉన్న 600 మీటర్ల స్థలాన్ని అభివృద్ధి చేసేందుకు, కన్సల్టెన్సీ సర్వీసు కోసం టెండర్లను ఆహ్వానించింది. రూ.27.61 లక్షలతో కాంట్రాక్టు అప్పగించింది. పనులు 90 రోజుల్లోగా పూర్తవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. ప్రాజెక్ట్స్ డైరెక్టరు టి.అర్జునన్ సమక్షంలో సీఎంఆర్ఎల్ సీజీఎం టి.లివింగ్‌స్టన్ ఎలియజర్, ఆర్వీ అసోసియేట్స్ ఉపాధ్యక్షురాలు జేకే నందన, అనరాక్ ప్రాపర్టీ సంస్థ ఉపాధ్యక్షుడు ఎస్.వినోద్ ఒప్పందాలపై సంతకాలు చేశారు. ఇరు సంస్థలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎడప్పాడి ఒంటరిగా పార్టీ నడపలేరు

ఈవీకేఎస్ ఇళంగోవన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈవీకేఎస్ ఇళంగోవన్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఎడప్పాడి పళనిసామి ఒంటరిగా పార్టీ నడపలేరని కాంగ్రెస్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ అభిప్రాయపడ్డారు. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ డిమాండ్ చేస్తూ తమిళనాడు మహిళా కాంగ్రెస్ తరఫున ఈరోడ్ జిల్లా గోపిచెట్టిపాలయంలో శుక్రవారం నిర్వహించిన మతసామరస్య ఐక్యత పాదయాత్రను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... గుజరాత్‌లో మహిళలపై అత్యాచారానికి పాల్పడి జైలుకెళ్లిన 12 మందిని ప్రధాని మోదీ, అమిత్‌షా సిఫారసుతో విడదల చేయడమే కాకుండా వారికి ఘనస్వాగతం పలికారని ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ సీఎం తిరుమల లడ్డూ నాణ్యతపై వదంతులు వ్యాప్తి చేశారని, నెయ్యిలో కల్తీ జరగలేదని చెప్పారు. ఉపముఖ్యమంత్రి పదవికి ఉదయనిధి సరిపోతారని తెలిపారు. విజయ్ పార్టీ స్థాపించి రెండు నెలలయినా ఎందుకు ప్రారంభించారన్నది ఆయనకే తెలియలేదన్నారు.

'టీఎన్ అలర్ట్' యాప్ ఆవిష్కరణ



యాప్ ఆవిష్కరిస్తున్న మంత్రి రామచంద్రన్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో గత నెల 30వ తేదీ చెన్నై సచివాలయంలో ఈశాన్య రుతుపవనాల ముందస్తు జాగ్రత్తలపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా రుతుపవనాల వర్షాలకు సమర్థవంతంగా ఎదుర్కోవడానికి, వర్షాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు తెలియజేసేలా 'టీఎన్ అలర్ట్' పేరుతో మొబైల్ యాప్‌ను ప్రవేశపెట్టనున్నట్లు ప్రకటించారు. ఆ మేరకు గురువారం సాయంత్రం రాష్ట్ర విపత్తుల నిర్వహణ కేంద్రంలో మంత్రి రామచంద్రన్ యాప్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి కేఎస్ పళనిసామి, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కొత్త పార్టీలో మొదట ఉత్సాహమే ఉంటుంది

జీకే వాసన్



మాట్లాడుతున్న జీకే వాసన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కొత్త పార్టీని స్థాపించినప్పుడు మొదట ఉత్సాహంగానే ఉంటుందని, ఇప్పుడు అదే స్థితిలో టీవీకే ఉందని టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ తెలిపారు. పార్టీ తిరుచ్చి, పెరంబలూర్, అరియలూర్ జిల్లాల నిర్వాహకుల సమావేశం శుక్రవారం పార్టీ అధ్యక్షుడు జీకే వాసన్ నేతృత్వంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ... రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. ప్రస్తుతం సభ్యుల చేరిక జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మద్యం దుకాణాలను మూసివేసే పూర్తి అధికారం రాష్ట్ర ప్రభుత్వం చేతుల్లోనే ఉందన్నారు. 160 మందికిపైగా రాష్ట్ర జాలర్లు శ్రీలంక జైళ్లలో ఉన్నారని, వారిని విడిపించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు.

షూటింగ్ పోటీల్లో విజేతలకు అభినందనలు



కమిషనరు లోకనాథన్‌తో పతకాలు సాధించిన పోలీసులు

ప్యారిస్, న్యూస్‌టుడే: తమిళనాడు పోలీసులకు రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీలు సెప్టెంబరు 26 నుంచి 28వ తేదీ వరకు కాంచీపురం జిల్లా ఒట్టివాక్కంలోని కమాండో శిక్షణ పాఠశాలలో నిర్వహించారు. పలు జోన్‌లకు చెందిన పోలీసులు పాల్గొన్నారు. రైఫిల్ షూటింగ్, కార్బైన్ గన్ షూటింగ్, పిస్టల్, రివాల్వర్ షూటింగ్ తదితర విభాగాల్లో పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు జరిగాయి. ఇందులో దక్షిణ జోన్ జట్టు రెండు బంగారు పతకాలతో పాటు మొత్తం ఏడు పతకాలు, రెండు షీల్డులను సాధించింది. ఈ నేపథ్యంలో పతకాలు సాధించిన జట్టును శుక్రవారం మదురై పోలీసు కమిషనరు లోకనాథన్ తన కార్యాలయానికి పిలిపించి అభినందించారు.

వైభవంగా శరన్నవరాత్రి సంబరాలు





లక్ష్మీదేవి అలంకరణలో కన్యకాపరమేశ్వరి ◆ మహిళా కళాశాల విద్యార్థినుల బృంద నృత్యం

ప్యారిస్, న్యూస్‌టుడే: జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. రెండో రోజైనా శుక్రవారం ఉదయం వేదపారాయణాలు, శ్రీ వాసవి మూలమంత్ర హోమం నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, అలంకరణలు, ఆరాధనలు చేశారు. అనంతరం కన్యపూజ నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని సూర్యప్రభ వాహనంపై లక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా వాసవి క్లబ్ షావుకారుపేట సభ్యుల బృందగానం, శ్రీ కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల విద్యార్థినుల కదంబ కార్యక్రమం కనువిందు కలిగించాయి. శుక్రవారం ఉత్సవానికి కందగడ్డల చెళ్ళపిళ్ల శ్రేష్ఠి ఛారిటీస్ ఉభయదారులుగా వ్యవహరించారు. పాలకమండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రైవేట్ పాఠశాలలకు బాంబు బెదిరింపులు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ పుళ్ళిపురత్తాన్ పాళయంలోని ప్రైవేట్ పాఠశాల ఈ-మెయిల్‌కు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో పాఠశాలకు సెలవు ప్రకటించి విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారు ఆందోళనతో పాఠశాలకు చేరుకొని తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. పెరుందురై డీఎస్పీ గణేష్‌కుమార్ నేతృత్వంలో సిబ్బంది పాఠశాలలో క్షుణ్ణంగా తనిఖీ చేసి బాంబులు లేవని నిర్ధారించారు. అదేవిధంగా నారాయణ వాసల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాల, వీరప్పంపాలయం ప్రాంతంలోని ప్రైవేట్ పాఠశాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి.

కొచ్చువేలికి వీక్లీ ప్రత్యేక రైలు

వడపళని, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీ కారణంగా తాంబరం - కొచ్చువేలి - తాంబరం వీక్లీ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ రైల్వే శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. **06035** తాంబరంలో 11, 18, 25, నవంబరు 1, 8, 15, 22, 29 డిసెంబరు 6, 13, 20, 27 తేదీలు (శుక్ర) 19.30కు బయలుదేరి మరుసటి రోజు 11.30కి కొచ్చువేలి చేరుతుంది. **06036** కొచ్చువేలిలో 13, 20, 27 నవంబరు 3, 10, 17, 24 డిసెంబరు 1, 8, 15, 22, 29 తేదీలు (ఆది) 15.25కు బయలుదేరి మరుసటి రోజు 07.35కి తాంబరానికి వస్తుంది. రిజర్వేషన్లు కూడా ప్రారంభమయ్యాయి. సికింద్రాబాదు డివిజన్‌లోని విజయవాడ - కాజీపేట - బల్లార్షా సెక్షనులో జరుగుతున్న ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా **12269** చెన్నై సెంట్రల్ - హజరత్ నిజాముద్దీన్ 7వ తేదీ 06.35కు బయలుదేరాల్సిన రైలు 07.45గంటలకు ఆలస్యంగా నడుస్తుంది.

కూల్ లిప్ విక్రేతలపై గూండా చట్టం ఎందుకు నమోదు చేయకూడదు?

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మదురై ధర్మాసనం

ప్యారిస్, న్యూస్‌టుడే: కూల్ లిప్ అనే పొగాకు ఉత్పత్తి విక్రయించే వారిపై గూండా చట్టం కింద ఎందుకు చర్యలు చేపట్టకూడదని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. జస్టిస్ భరత చక్రవర్తి మదురై ధర్మాసనంలో బెయిల్, ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ జరుపుతున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, యువత తమిళనాడు ప్రభుత్వం నిషేధించిన పొగాకు ఉత్పత్తులను వినియోగిస్తున్నట్లు, కూల్ లిప్ అనే గుట్కాను అధికంగా విక్రయిస్తున్నట్లు పోలీసులు నమోదు చేసిన కేసుల్లో బెయిల్, ముందస్తు బెయిల్ కోరుతూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ కేసులకు సంబంధించిన విచారణ శుక్రవారం మళ్లీ విచారణకు వచ్చింది. అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన గుట్కా, కూల్ లిప్ మొదలైన వాటిని పక్క రాష్ట్రాల నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తరఫున తెలిపారు. వాటిని విక్రయించడాన్ని అడ్డుకునేలా తీవ్ర చర్యలు చేపడుతున్నారని, అయినా విక్రయిస్తున్న 20 వేల దుకాణాలకు సీల్ వేసినట్లు, పలువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం అన్ని తరఫు వాదనలు విన్న న్యాయమూర్తి.. ప్రస్తుతం కూల్ లిప్, గుట్కా, పొగాకు ఉత్పత్తులు యువకులు మాత్రమే కాకుండా పాఠశాల విద్యార్థులు అధికంగా వినియోగిస్తున్నారని, వారి భవిష్యత్తు ప్రశ్నార్థకమైందన్నారు. కల్తీ సారా, గంజాయి, నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయించే వారిపై ప్రభుత్వం గూండా చట్టం నమోదు చేస్తుందని, కూల్ లిప్ వంటి వాటిని విక్రయించే వారిపై అలాంటి చర్యలు చేపడితేనే వాటిని అడ్డుకోవడం కుదురుతుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాంటి వస్తువుల విక్రయానికి నిషేధం విధించడానికి త్వరలో కోర్టు తగిన ఆదేశాలు జారీచేస్తుందని తెలుపుతూ తీర్పును వాయిదా వేశారు.



విద్యార్థులకు ధ్రువపత్రాలు అందిస్తున్న డాక్టర్ సెల్వం

వీఐటీలో వైజ్ఞానిక సదస్సు ప్రారంభం

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ వీఐటీ విశ్వవిద్యాలయంలో 11వ వైజ్ఞానిక సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఉప ఛైర్మన్ డాక్టర్ సెల్వం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. తొలుత ప్లాస్టిక్ సంచుల వినియోగానికి స్వస్తి పలకాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పేర్కొన్నారు. తమ వర్సిటీలో భూతాపం నుంచి భూమిని రక్షించే విధానాలపై కోర్సు ఉందని, దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సెల్వం ధ్రువపత్రాలు అందజేశారు. శనివారం కూడా సదస్సు కొనసాగనుంది.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో మంత్రి పొన్ముడి

అడవులను సంరక్షించండి

ప్యారిస్, న్యూస్‌టుడే: అడవులను సంరక్షిస్తేనే సహజ వనరులను కాపాడగలమని అటవీశాఖ మంత్రి పొన్ముడి తెలిపారు. అటవీశాఖ తరఫున వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల ప్రారంభోత్సవం శుక్రవారం చెన్నై గిండి చిల్డ్రన్స్ పార్క్‌లో జరిగింది. మంత్రి పొన్ముడి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వన్యప్రాణుల సంరక్షణపై పాఠశాలలు, కళాశాలల్లో జరిగిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అటవీశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా పాల్గొన్న కార్యక్రమం ఇదేనన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి అటవీశాఖకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అడవులు, పర్యావరణశాఖ కార్యదర్శి సెందిల్‌కుమార్, అటవీశాఖ హెడ్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ సస్పెన్షన్ ఉత్తర్వులు రద్దు

ప్యారిస్: కోయంబత్తూరు అన్నాడీఎంకే మున్సిపల్ కార్పొరేటర్‌ను సస్పెండ్ చేస్తూ మేయర్ జారీ చేసిన ఉత్తర్వులను మద్రాసు హైకోర్టు రద్దు చేసింది. కోయంబత్తూరులో సెప్టెంబరు 13న మేయర్ నేతృత్వంలో సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న 47వ డివిజన్ అన్నాడీఎంకే కార్పొరేటర్ ప్రభాకరన్‌ను తర్వాతి మూడు సమావేశాల్లో పాల్గొనకుండా సస్పెండు చేస్తూ మేయర్ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వులను సవాలు చేస్తూ ప్రభాకరన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అందులో.. తాను ఎలాంటి తప్పు చేయకుండానే సస్పెండు చేసినట్లు తెలిపారు. ఈ పిటిషన్ జస్టిస్ ఇళంతిరైయన్ ఎదుట శుక్రవారం విచారణకు వచ్చింది. పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి.. సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేశారు.

ఆన్‌లైన్ జూదానికి నిషేధం పొందాలి

సైదాపేట, న్యూస్‌టుడే: ఆన్‌లైన్ జూదానికి రాష్ట్ర ప్రభుత్వం నిషేధం పొందాలని పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... ఆన్‌లైన్ జూదానికి స్వస్తి పలికేందుకు ఒకే మార్గం మద్రాసు హైకోర్టు తీర్పుకు సుప్రీం కోర్టులో నిషేధం పొందడమేనని తెలిపారు. అయితే తీర్పు వచ్చి 11 నెలలు అవుతున్నా సుప్రీం కోర్టులో నిషేధం పొందేందుకు తమిళనాడు ప్రభుత్వం వల్ల కాలేదన్నారు. గత కొన్ని రోజుల్లోనే ఆన్‌లైన్ జూదంతో 15 మంది ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. లక్షల కుటుంబాలు ఆస్తులు కోల్పోయాయని పేర్కొన్నారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని సరైన కారణాలు కోర్టులో చెప్పి ఆన్‌లైన్ జూదానికి నిషేధం పొందాలని తెలిపారు.

డీఎన్‌ఏకు జీబ్రాన్ నేపథ్య సంగీతం



చిత్రబృందం విడుదల చేసిన పోస్టరు

చెన్నై: నెల్సన్ వెంకటేశన్ దర్శకత్వంలో ఆధర్వ, నిమిషా సజయన్ జంటగా నటిస్తున్న చిత్రం 'డీఎన్‌ఏ'. చిత్రంలోని ఐదు పాటలకు ఐదుగురు సంగీత దర్శకులు పనిచేయనున్నట్లు చిత్ర బృందం గతంలో వెల్లడించింది. ఈ నేపథ్యంలో చిత్రానికి నేపథ్య సంగీతాన్ని జీబ్రాన్ అందిస్తున్నట్టు దర్శకుడు నెల్సన్ వెంకటేశన్ తెలిపారు. దీనికి సంబంధించి పోస్టరు విడుదల చేశారు. ప్రస్తుతం చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ పనులు తుది దశకు చేరాయి. త్వరలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

పూజతో ప్రారంభమైన మెడ్రాస్ మాఫియా కంపెనీ

చెన్నై, న్యూస్‌టుడే: అన్నా ప్రొడక్షన్స్ పతాకంపై వి.సుగంధి నిర్మిస్తున్న చిత్రం 'మెడ్రాస్ మాఫియా కంపెనీ'. వర్ధమాన దర్శకుడు ఏ.ఎస్. ముకుందన్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో ఆనంద్‌రాజ్, బిగ్‌బాస్ ఫేమ్ సంయుక్త నటిస్తున్నారు. ఉత్తర చెన్నై నేపథ్యంతో రూపొందుతున్న ఈ చిత్రంలో దాదా పాత్రలో ఆనంద్ రాజ్, పోలీసు అధికారి పాత్రలో సంయుక్త నటిస్తున్నారు. మునీశ్‌కాంత్, దీప, శశిలయ, రామ్స్, ఆనంద్‌బాబు తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది.


పూజ కార్యక్రమంలో చిత్రబృందం


పూజ కార్యక్రమంలో విజయ్, పూజా హెగ్డే తదితరులు

దళపతి 69లో ప్రకాశ్‌రాజ్

చెన్నై: విజయ్ 69వ చిత్రానికి తాత్కాలికంగా 'దళపతి 69' టైటిల్ ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఈ చిత్రంలో బాబీ దేవోల్, పూజా హెగ్డే, మమితా బైజు, గౌతం వాసుదేవ్ మేనన్, నరేన్, ప్రియమణి తదితరులు నటిస్తున్నట్టు వరుస అప్డేట్లను చిత్రబృందం వెల్లడించింది. ఈ నేపథ్యంలో చిత్రంలో ప్రకాశ్‌రాజ్ కూడా చేరినట్టు ప్రకటించింది. చిత్రం పూజా కార్యక్రమం శుక్రవారం జరిగింది.

గోట్ ఉంగరంతో విజయ్


విజయ్ పంచుకున్న చిత్రం

చెన్నై: దర్శకుడు వెంకట్ ప్రభు, నటుడు విజయ్ కాంబినేషన్‌లో రూపొందిన 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్' (గోట్) చిత్రం విడుదలై ప్రేక్షకుల ఆదరాభిమానాలు పొందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 'జీవోఏటీ' అక్షరాలతో ఉన్న ఉంగరాన్ని ధరించిన ఫొటోను విజయ్ తన 'ఎక్స్' పేజీలో పంచుకున్నారు. విజయ్ రాజకీయ అరంగేట్రానికి సంబంధించిన పలు రిఫరెన్స్‌లు 'గోట్' చిత్రంలో చోటుచేసుకోవడం గమనార్హం.

పుఱనానూఱు నుంచి అప్డేట్

చెన్నై: సుధ కొంగర దర్శకత్వంలో రూపొందనున్న 'పుఱనానూఱు' చిత్రంలో శివ కార్తికేయన్, శ్రీలీల హీరోహీరోయిన్లుగా నటించనున్నట్టు తెలిసిందే. ఈ నేపథ్యంలో చిత్రంలో నటుడు ఆధర్వ, మలయాళ నటుడు రోషన్ మాథ్యూ కూడా నటించనున్నట్టు కోలీవుడ్ సమాచారం. చిత్రీకరణ పనులు వచ్చే ఏడాది జనవరిలో చేపట్టాలని ప్రణాళిక రూపొందించినట్టు తెలిసింది.



పట్టాలు ప్రదానం చేస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవి

ఘనంగా 'టీపీఈఎస్‌యూ' స్నాతకోత్సవం

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడు ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ విశ్వవిద్యాలయం 14వ స్నాతకోత్సవం సైదాపేటలోని తమిళనాడు ఓపెన్ యూనివర్సిటీ ప్రాంగణంలో శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం కులపతియైన గవర్నర్ ఆర్.ఎన్.రవి, ప్రోఛాన్సలర్ అయిన ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పాల్గొన్నారు. వారిద్దరూ జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 3,638 మంది విద్యార్థులకు పట్టాలు అందజేసే కార్యక్రమాన్ని గవర్నర్ ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పద్మశ్రీ అనితా పాల్ దురై, ఉప కులపతి, విశ్వవిద్యాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రాజేంద్రన్‌కు ఘన స్వాగతం

సేలం, న్యూస్‌టుడే: రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన రాజేంద్రన్ తొలిసారిగా శుక్రవారం ఆయన సొంత జిల్లా సేలం విచ్చేశారు. పార్టీ శ్రేణులు రైల్వే స్టేషన్‌లో ఆయనకు ఘనంగా స్వాగతం పలికాయి. అనంతరం ఆయనను ఊరేగింపుగా పార్టీ కార్యాలయానికి తీసుకెళ్లారు. అక్కడ దివంగత మాజీ ముఖ్యమంత్రులు కరుణానిధి, అన్నాదురై విగ్రహాలకు రాజేంద్రన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉదయం 11 గంటలకు మంత్రి రైల్వే స్టేషన్‌కు చేరుకుంటున్నట్లు తెలియగా పోలీసులు ఉదయం 8 గంటల నుంచే వాహనాలను దారి మళ్లించడంతో వాహన చోదకులు, రైలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.


కరుణానిధి విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాజేంద్రన్

గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమిపూజ

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట మున్సిపాలిటీకి చెందిన వారసంత మైదానంలో శుక్రవారం జిల్లా కలెక్టరు చంద్రకళ నేతృత్వంలో రూ.3.73 కోట్ల వ్యయంతో జిల్లా ప్రధాన గ్రంథాలయ భవన నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం జరిగింది. పాల్గొన్న మంత్రి ఆర్.గాంధీ పునాదిరాయి అందజేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షురాలు సుజాత వినోద్, ప్రజాపనుల శాఖ ఈఈ త్రిపుర సుందరి, జిల్లా గ్రంథాలయ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పునాదిరాయి అందిస్తున్న మంత్రి ఆర్.గాంధీ




గజలక్ష్మిగా శ్రీకన్యకా పరమేశ్వరి ● మహాలక్ష్మి అలంకరణలో శ్రీకొళ్లాపురమ్మ ● కాంచీపురం: కాంచీపురం కామాక్షి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న లక్ష్మి, సరస్వతి సమేత కామాక్షమ్మ

గజలక్ష్మి అవతారంలో కన్యకాపరమేశ్వరి కటాక్షం

పళ్లిపట్టు, న్యూస్‌టుడే: పళ్లిపట్టు బజారు వీధిలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారు గజలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు జరిగాయి. అదేవిధంగా పళ్లిపట్టు పట్టణ దేవత శ్రీకొళ్లాపురమ్మ మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు.


నిర్మానుష్యంగా ధర్మపురిలోని ఓ వీధి

పీఎంకే బంద్ విజయవంతం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కావేరి మిగులు జలాల ప్రాజెక్టును అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ధర్మపురి జిల్లా వ్యాప్తంగా పీఎంకే తరఫున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు దుకాణాలు మూసేసి ఆందోళన చేపట్టారు. దీంతో జిల్లా వ్యాప్తంగా పోలీసులు భద్రతా విధులు నిర్వహించారు. జిల్లాలోని వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, దుకాణాలు, తోపుడు బండ్లు ఇలా అన్ని రకాల దుకాణాలు మూతబడ్డాయి. పాలక్కాడు మాల్, ఎంజీ రోడ్డు, ధర్మపురి తదితర అన్ని ప్రాంతాలలో దుకాణాలు మూసివేయడంతో జన జీవనం స్తంభించింది. ఆయా ప్రాంతాలు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి.

కున్రక్కుడి అడిగళార్ ఆశీస్సులు పొందిన మంత్రి పొన్ముడి

వేళచ్చేరి, న్యూస్‌టుడే: కున్రక్కుడి అడిగళార్ శుక్రవారం విళుపురంలోని రాష్ట్ర అటవీశాఖ మంత్రి పొన్ముడి ఇంటికి వచ్చారు. ఆయనకు పొన్ముడి, ఆయన సతీమణి విశాలాక్షి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి దంపతులు, కుమారుడు గౌతమ శిఖామణి తదితరులు కున్రక్కుడి అడిగళార్ ఆశీస్సులు పొందారు.

బీవీఎస్ సదరన్ జోన్ ప్రయోగశాల ప్రారంభం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: చెన్నై తరమణిలో భారతీయ ప్రమాణాల సంస్థ (బీవీఎస్) దక్షిణ ప్రాంతీయ కార్యాలయంలో ఆధునికీకరించిన సదరన్ జోన్ ప్రయోగశాలను ఇండియన్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జనరల్ ప్రమోద్‌కుమార్ తివారీ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీవీఎస్ డిప్యూటీ డైరెక్టర్ నిషాద్ సుల్తాన్ హక్ (పరిశోధనలు), సౌత్ జోన్ చీఫ్ డిప్యూటీ డైరెక్టర్ ప్రవీణ్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అధ్యక్షురాలి ఫిర్యాదుపై విచారణ

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ఆనాంగూర్ పంచాయతీ అధ్యక్షురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విళుపురం జిల్లా అదనపు కలెక్టరు విచారణ జరుపుతున్నారని విళుపురం జిల్లా కలెక్టరు పళని తెలిపారు. శుక్రవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. విళుపురం జిల్లా సెంజి తాలూకా వల్లం పంచాయతీ యూనియన్ ఆనాంగూర్ గ్రామ పంచాయతీకి 2021లో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అధ్యక్షురాలి పదవికి షెడ్యూల్ తెగకు చెందిన సంగీత పోటీ చేసి గెలుపొందారని, బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆమె నేతృత్వంలో అనేక గ్రామ సభలను నిర్వహించారని తెలిపారు. అయితే ఇటీవల నిర్వహించిన గ్రామ సభలో తనను తన కుర్చీలో కూర్చోకుండా కొందరు అడ్డుకున్నారని ఆరోపిస్తూ జిల్లా యంత్రాంగానికి, పోలీసుకులకు సంగీత ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు జిల్లా అదనపు కలెక్టరు (అభివృద్ధి), పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారని తెలిపారు.

తిరుచ్చి ఎస్పీ పిటిషన్‌పై 'ఎక్స్' ఇన్‌ఛార్జి సమాధానమివ్వాలి

మదురై ధర్మాసనం

ప్యారిస్, న్యూస్‌టుడే: తిరుచ్చి ఎస్పీ వరుణ్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం, 'ఎక్స్' వెబ్‌సైట్ ఇన్‌ఛార్జి అధికారి సమాధానమివ్వాలని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. నామ్ తమిళర్ కట్చి 'ఎక్స్'లో పోస్ట్ చేసిన అనుచిత వ్యాఖ్యలు తొలగించాలని కోరుతూ తిరుచ్చి జిల్లా ఎస్పీ వరుణ్‌కుమార్ మదురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలు చేశారు. అందులో.. తిరుచ్చి జిల్లా ఎస్పీగా 2023 ఆగస్టు 11వ తేదీ నుంచి తాను విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తన భార్య పుదుక్కోట్టై జిల్లా ఎస్పీగా పని చేస్తున్నారని, తమకు ముగ్గురు పిల్లలు ఉన్నారని పేర్కొన్నారు. జులై 11న సైబర్ క్రైం ఇన్‌స్పెక్టరు అరుణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నామ్ తమిళర్ కట్చికి చెందిన సాట్టై దురై మురుగన్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనంతరం ఎన్‌టీకే సమన్వయకర్త సీమాన్.. తాను కుల వివక్ష చూపుతున్నట్లు అనుచిత వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారన్నారు. ఆ తర్వాత సాట్టై దురైమురుగన్, కార్తి, సీమాన్ తదితరులు తనను కించపరిచేలా విలేకరులతో మాట్లాడారని పేర్కొన్నారు. అనంతరం ఈ వ్యవహారమై తాను తిల్లైనగర్ పోలీసులకి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఫిర్యాదు మేరకు మొత్తం 14 మందిపై కేసు నమోదు చేశారని, కేసు దర్యాప్తునకు కొందరి 'ఎక్స్' ఐడీలు అవసరమని, అప్పుడే దర్యాప్తు సక్రమంగా జరపడం కుదురుతుందని, దీంతో తిల్లైనగర్ పోలీసులు బెంగళూరులోని 'ఎక్స్' సంస్థకు లేఖ రాశారని, కానీ సంస్థ తగిన సమాచారం ఇవ్వలేదన్నారు. కావున పోలీసులు అడిగిన సమాచారం ఇవ్వాలని 'ఎక్స్' సంస్థను ఆదేశించాలని కోరారు. అదేవిధంగా తన ఫిర్యాదుపై సూచించిన సమయంలో దర్యాప్తుని పూర్తిచేసేలా తిల్లైనగర్ పోలీసులకి ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. అనంతరం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ మురళి శంకర్... పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం, 'ఎక్స్' భారత విభాగ ఇన్‌ఛార్జి సమాధాన పిటిషన్ దాఖలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చి విచారణను 21కి వాయిదా వేశారు.

2026లో డీఎంకే అవినీతిని వెలికితీస్తాం

హెచ్.రాజా

టీనగర్, న్యూస్‌టుడే: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా అధికారంలో వస్తుందని, తర్వాత రాష్ట్రంలో డీఎంకే నేతల అవినీతిని వెలుగులోకి తెస్తామని భాజపా సీనియర్ నేత హెచ్.రాజా పేర్కొన్నారు. శుక్రవారం తిరునెల్వేలిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో డీఎంకే అవినీతికి పాల్పడుతుండటంతో జనాదరణ కోల్పోతోందన్నారు. భాజపా బలం పెరుగుతోందన్నారు. రాష్ట్రంలో సారా తాగి మరణిస్తున్న వారి సంఖ్య గతేడాది 28 ఉండగా ఈ ఏడాది 68కి పెరిగిందన్నారు. ఓ వైపు సారా మృతుల సంఖ్య పెరుగుతుండగా మరో వైపు అధికారంలోని డీఎంకే, దాని కూటమి పార్టీయైన వీసీకే మద్యపాన నిషేధానికి మహానాడు నిర్వహించి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నాయని ఎద్దేవాచేశారు.


యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టరు కార్తికేయన్

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించండి

తిరునెల్వేలి, న్యూస్‌టుడే: రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారిస్తూ ముందడుగు వేయాలని తిరునెల్వేలి జిల్లా కలెక్టర్ కార్తికేయన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లాలో ఏర్పాటైన సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల విలువ జోడింపు కేంద్రాన్ని కలెక్టర్ గురువారం ప్రారంభించారు. చేరన్‌మాదేవి ప్రాంతంలోని సంబంధిత కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న కార్తికేయన్ కొత్తగా ఏర్పాటైన యంత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తామిరా సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తుల సంస్థ 2020లో ప్రారంభమై విజయవంతంగా నిర్వహణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇందులో కొబ్బరి పీచు తొలగింపు యంత్రం, నూనె శుద్ధీకరణ తదితర పలు యంత్రాలుండగా రైతులు వినియోగించుకుని లబ్ధి పొందుతున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని పాళయంగోట్టై, నాంగునేరి, చేరన్‌మాదేవి, మానూర్ తదితర ప్రాంతాల్లో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులు అనేకమంది ఇందులో సభ్యులుగా చేరినట్లు తెలిపారు.

ఊటీ వృద్ధాశ్రమం నగరపాలక సంస్థకు అప్పగింత

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లా ఊటీ సమీప ముల్లిక్కొరై ప్రాంతంలో తమిళనాడు అర్బన్ లైవ్లీహుడ్స్ ఇనిషియేటివ్ స్వచ్ఛంద సంస్థ తరఫున 'అబ్దుల్‌కలాం డెస్టిట్యూట్ హోమ్' పని చేస్తోంది. ఇందులో అవకతవకలు చోటుచేసుకుంటున్నట్టు ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ లక్ష్మీభవ్య విచారణ జరపడానికి ముగ్గురితో కూడిన కమిటీని నియమించారు. ఆ మేరకు విచారణ చేపట్టిన ఆర్డీవో మహరాజ్, మున్సిపల్ కమిషనర్ జహంగీర్ బాషా, జిల్లా ప్రత్యేక కమిషనర్ సంగీతరాణి నేతృత్వంలోని కమిటీ ఈ నెల 2వ తేదీ నివేదిక సమర్పించింది ఈ నేపథ్యంలో విచారణ కమిటీ, పోలీసులు గురువారం హోమ్ నిర్వాహకుడు దస్తగిరి వద్ద విచారించారు. అనంతరం ఆయన్ను వెంటనే బయటకు పంపి ఆశ్రమాన్ని నగరపాలక సంస్థకు అప్పగించారు.

పీయూలో జాతీయస్థాయి కార్యశాల

వడపళని, న్యూస్‌టుడే: న్యూక్లియర్ మ్యాగ్నటిక్ రెసోనెన్స్ స్పెక్ట్రోస్కోపీ (ఎన్ఎంఆర్-2024) అంశంపై పుదుచ్చేరి యూనివర్సిటీ (పీయూ)లో శుక్రవారం జాతీయస్థాయి కార్యశాల జరిగింది. వర్సిటీ 'సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ' ఆధ్వర్యంలో జరిగిన కార్యశాలను ఉపకులపతి, ఆచార్యులు కె.తరనిక్కరసు ప్రారంభించారు. ఫిజికల్, కెమికల్ అండ్ అప్లైడ్ సైన్సెస్ విభాగ డీన్, ఆచార్యులు కె.అన్బళగన్ కీలక ప్రసంగం చేశారు. సెంట్రల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ విభాగ హెడ్, ఆచార్యులు శివశంకర్, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి నుంచి పలు వర్సిటీలు, కళాశాలల విద్యార్థులు 175 మంది పాల్గొన్నారు. కార్యశాలలో పాల్గొన్నవారికి ధ్రువపత్రాలందజేశారు.

రెవెన్యూశాఖ పనితీరుపై సమీక్ష

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా కలెక్టరు కార్యాలయంలో శుక్రవారం కలెక్టరు చంద్రకళ నేతృత్వంలో రెవెన్యూ శాఖ తరఫున చేపట్టిన పనులపై మాసాంతర సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా కలెక్టరు జరిగిన పనులు, వాటి అభివృద్ధి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్వో సురేష్, కలెక్టరు పీఏ విజయరాఘవన్, ఆర్డీవోలు, తహసీల్దారులు, రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

65 మందిపై కేసు నమోదు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్ళూరు సమీప మేల్‌నల్లాట్టూరులో పురాతన లక్ష్మీనారాయణ పెరుమాల్ ఆలయం ఉంది. ఈ క్షేత్రంలో ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. పనులను గ్రామానికి చెందిన కొందరు అడ్డుకున్నారు. ఇందుకు నిరసనగా గ్రామస్థులు శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఇందుకు సంబంధించి పోలీసులు 65 మందిపై కేసు నమోదు చేశారు.

ఆస్పత్రిలో కలెక్టర్ తనిఖీ

వేలూర్, న్యూస్‌టుడే: వేలూర్ అడుక్కంపారైలోని ప్రభుత్వాస్పత్రిలో సిబ్బంది సరిగా విధులకు హాజరుకావడంలేదని, మందులు సరిగా అందజేయడంలేదనే ఆరోపణలు వచ్చాయి. ఆ మేరకు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆస్పత్రిలో శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నీటమునిగి ముగ్గురు బాలురి మృతి


జీవిధరన్, దర్శన్ (పాతచిత్రాలు)

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం జిల్లా మణంపూండికి చెందిన మురుగన్-కలైమతి దంపతుల కుమారులు జీవిధరన్ (10), దర్శన్ (8) ప్రభుత్వ పాఠశాలలో 5, 3 తరగతులు చదువుతున్నారు. అదే ప్రాంతానికి చెందిన శ్రీధర్ కుమారుడు హరిహరన్ (11) కీళంబూర్ ప్రైవేటు పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. ముగ్గురు బాలురు గురువారం మధ్యాహ్నం రెండు సైకిళ్లపై కోట్టమరుదూర్ పెద్ద చెరువు వద్దకు వెళ్లి ఆడుకుంటుండటాన్ని ఆప్రాంతవాసులు చూశారు. సాయంత్రం ఆప్రాంతానికి చెందిన ధర్మ అనే వ్యక్తి చెరువులో చేపలు పట్టడానికి వల వేయగా ఓ బాలుడి మృతదేహం చిక్కుకోవడంతో బయటకు తీశాడు. గ్రామస్థులు చెరువులో దిగి గాలించి మిగిలిన ఇద్దరు బాలుర మృతదేహాలను వెలికితీశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

రైలు ఢీకొని యువకుడు...


ఛత్రియన్ (పాతచిత్రం)

పొన్నేరి: పొన్నేరి సమీప పెరియ కావణానికి చెందిన ఛత్రియన్ (21) కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇతను గురువారం సాయంత్రం పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కొరుక్కుపేట రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలోపడి కళాశాల విద్యార్థి...

పళ్లిపట్టు: పళ్లిపట్టు తాలూకా ఆర్‌కేపేట యూనియన్ సహస్ర పద్మాపురం గ్రామానికి చెందిన సేట్ కుమారుడు నితీష్ (16) ప్లస్‌వన్ చదువుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం ఆ ప్రాంతంలో ఉన్న వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడు. ఆర్‌కేపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడి హత్య

ప్యారిస్, న్యూస్‌టుడే: మదురై జిల్లా చోళవందన్ ప్రాంతానికి చెందిన అయ్యనార్ అనే వ్యక్తి స్థానికంగా ఉంటున్న ముత్తుసామి, తవమణి దంపతుల కుమారుడు మిథున్ (7)పై మద్యం మత్తులో కత్తితో దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన మిథున్‌ని తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బాలుడు శుక్రవారం మృతిచెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసు నిందితుడిపై కాల్పులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిండుక్కల్‌లో బస్టాండ్ ప్రాంతంలో ఇటీవల ఇర్ఫాన్ అనే వ్యక్తిని ఓ ముఠా హత్య చేసింది. ఇందుకు సంబంధించి నలుగురిని దిండుక్కల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు జిల్లా కోర్టులో లొంగిపోయారు. ఇదిలా ఉండగా హత్యకు ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకునేందుకు మలైపట్టి అటవీ ప్రాంతానికి నిందితుడైన రిచర్డ్ సచిన్‌ని పోలీసులు శుక్రవారం తీసుకెళ్లారు. ఆ సమయంలో అతను పోలీసులపై ఆయుధాలతో దాడి చేసి పారిపోయేందుకు యత్నించాడు. దీంతో పోలీసులు అతని ఎడమ కాలిపై తుపాకీతో కాల్చి పట్టుకున్నారు. అనంతరం దిండుక్కల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

యువకుడి బలవన్మరణం

ఊత్తుకోట, న్యూస్‌టుడే: ఊత్తుకోట సమీప చిన్నవన్నాన్‌కుప్పానికి చెందిన రాజ్‌కుమార్ (23) బీఎస్సీ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాలలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో ఓ ప్రైవేటు సంస్థ ఇటీవల నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేదు. దీంతో మనస్తాపానికి గురైన అతను శుక్రవారం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబీకులు వెంటనే చెన్నై స్టాన్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతి చెందాడు.

రూ.4.67 కోట్ల మోసానికి పాల్పడిన ముఠా అరెస్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై అభిరామపురంలో ఉంటున్న 72 ఏళ్ల విశ్రాంత ఇంజినీర్‌కి ఓ ఫోన్ కాల్ వచ్చింది. అవతలి వైపు మాట్లాడిన వ్యక్తి.. మీ సెల్‌ఫోన్ కనెక్షన్ రెండు గంటల్లో కట్ అవుతుందని, మరింత సమాచారం కోసం నెంబరు 9 నొక్కాలని తెలిపారు. దీంతో ఆయన నెంబరు 9ని నొక్కారు. వెంటనే అగంతకుడు.. మీ ఫోన్ నెంబరు, ఆధార్ ఉపయోగించి పలు బ్యాంకు ఖాతాలు తెరిచి హవాలా నగదు లావాదేవీలు జరిగాయని, మీపై ముంబయి, దిల్లీ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారని, మీ ఫోన్ కాల్‌ని ముంబయి పోలీసులకి కలుపుతున్నట్లు తెలిపారు. దీంతో భయపడిన విశ్రాంత ఇంజినీర్ కేసు నుంచి తనను విడుదల చేయాలని కోరారు. దీంతో మీ బ్యాంకు ఖాతాలో ఉన్న నగదు మొత్తం ఆర్‌బీఐ బ్యాంకు ఖాతాకు పంపాలని, 30 నిమిషాల్లో బ్యాంకు ఖాతాను సరిచూసి నగదు తిరిగి పంపుతారని అవతలి వైపు నుంచి సమాధానం వచ్చింది. అతను చెప్పిన ఖాతాకు రూ.4.67 కోట్లు బదిలీ చేశారు. తర్వాత తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. వారు దర్యాప్తు చేపట్టి విల్లివాక్కం, ట్రిప్లికేన్‌కి చెందిన ముఠాను అదుపులోకి తీసుకున్నారు. అదేవిధంగా పలు కేసులకి సంబంధించిన రూ.53 లక్షల నగదు, సెల్‌ఫోన్లు మొదలైన వాటిని స్వాధీనం చేసుకున్నారు.

పరారీ నిందితులు ఇద్దరు...

టీనగర్: సేలం జిల్లా వలసయూర్‌కు చెందిన శబరిశంకర్ సేలంతో పాటు అనేక ప్రాంతాల్లో నగల దుకాణాలు నిర్వహిస్తున్నాడు. నగల చీటీలు నిర్వహించి అనేక మంది నుంచి సుమారు వంద కోట్లు మేర వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు గతేడాది మేలో అతన్ని పోలీసులు అరెస్టు చేశారు. అతనికి మద్దతుగా దుకాణాలను నిర్వహించిన మరికొందరి కోసం గాలించారు. ఈ నేపథ్యంలో నిందితులలో కవిన్, అజిత్ అనే ఇద్దరు సేలం జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించి అరెస్టు చేశారు.

ఘర్షణకు పాల్పడిన నలుగురు...

రెడ్‌హిల్స్: తిరువళ్ళూరు సమీప పెరుంబాక్కానికి చెందిన వళయాపతి తన స్నేహితులు ఆదిత్యకుమార్, దినేష్‌తో కలిసి జవేలియగరంలోని టాస్మాక్ మద్యం దుకాణంలో శుక్రవారం మద్యం తాగాడు. మత్తులో వీరు దుకాణ మేనేజర్ పాండ్యన్, సిబ్బంది గణేశన్, సుందరేశన్, వెంకటేశన్‌పై బీరు సీసాలతో దాడి చేశారు. ప్రతిగా పాండ్యన్ సిబ్బందితో కలిసి వళయాపతి, అతని స్నేహితులపై దాడి చేశాడు. ఇరు వర్గీయులు చేసిన ఫిర్యాదు మేరకు తిరువళ్ళూరు పోలీసులు దర్యాప్తు చేపట్టి పాండ్యన్, గణేశన్, వళయాపతి, ఆదిత్యకుమార్‌ను అరెస్టు చేశారు. పరారీలో ఉన్న మిగతా వారి కోసం గాలిస్తున్నారు.

క్రైం కార్నర్

అవినీతికి పాల్పడిన ఇద్దరు బ్యాంకు ఉద్యోగులు...


శంకర్, భారతి

అరక్కోణం, వేలూర్: రాణిపేట జిల్లా వాలాజాపేట సమీప తెన్‌కడపన్‌తాంగల్ గ్రామంలోని సహకార బ్యాంకులో పదవీ విరమణ చేసిన ఉద్యోగులను తిరిగి విధుల్లో చేర్చుకున్నట్లు శంకర్, భారతి అనే అధికారులు తప్పుడు పత్రాలు సృష్టించారు. 2018 నుంచి 2023 వరకు వారికి రూ.7.83 కోట్లు వేతనాల కింద చెల్లించినట్లు తప్పుడు లెక్కలు చూపారు. ఈ నేపథ్యంలో ఇద్దరిని వేలూరు ఆర్థికనేరాల విభాగ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.

చోరీ కేసులో ఆరుగురు...

పళ్లిపట్టు: పళ్లిపట్టు తాలూకా కొత్తకుప్పం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు విజయలునాయుడు (66) ఇంట్లో గత నెల 26వ తేదీ 50 సవర్ల బంగారు నగలు, రూ.70 వేల నగదు చోరీకి గురైంది. పోలీసులు దర్యాప్తు చేపట్టి ఆర్‌కేపేట సమీప కొండాపురానికి చెందిన చిరంజీవి (32), వాసు (54), రాఘవనాయుడు కుప్పం గ్రామానికి చెందిన వేణు (35), భూపతి (24), చిత్తూరు జిల్లా పాలసముద్రం మండలం కనికాపురం కాలనీకి చెందిన దినేష్ (23), రాణిపేట జిల్లా అరక్కోణం సమీప మోసూర్ గ్రామానికి చెందిన శుభ (42)ను అరెస్టు చేశారు. వారి నుంచి 34 సవర్ల బంగారు నగలు, రూ.8 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

నటి సోనా ఇంట్లో చోరీయత్నం

ప్యారిస్, న్యూస్‌టుడే: ప్రముఖ సినీనటి సోనా కుటుంబంతో కలిసి చెన్నై మధురవాయల్‌లో నివాసం ఉంటున్నారు. గురువారం రాత్రి కొందరు దుండగులు ఈమె ఇంటి ప్రహరీ ఎక్కి లోనికి దూకారు. వారిని చూసిన పెంపుడు శునకం పెద్దగా మొరగడంతో సోనా బయటకు వచ్చారు. దీంతో ఇద్దరు వ్యక్తులు పారిపోవడానికి యత్నించారు. ఆమె కేకలు వేయడంతో కత్తితో బెదిరించి అక్కడి నుంచి తప్పించుకున్నారు. సోనా వెంటనే కంట్రోల్ రూమ్‌కి సమచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకుని సీసీ కెమెరాల సాయంతో దర్యాప్తు చేస్తున్నారు.